ప్రజాశక్తి

సోమవారం 19, జూన్ 2023 5 అనంతపురం

వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపుదాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలపై భారాలు మోపుతూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపుదామని టిడిపి జిల్లా నేతలు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనను వ్యతిరేకించడంతోపాటు బాపట్ల జిల్లాలో పదో తరగతి విద్యార్థిని సజీవదహనం చేసిన ఘటనను ఖండిస్తూ టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నగర అధ్యక్షుడు మారుతీకుమార్‌గౌడ్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, జిల్లా బిసి అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థిని సజీవ దహనం చేసిన వైసిపి గుండాలను శిక్షించాలన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని కోరారు. సహజ వనరుల దోపిడీని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సిమెంట్ పొలన్న, వేవళ్ల మురళి, డిష్ నాగరాజు, నారాయణస్వామి యాదవ్, గాండ్ల విశాలాక్షి, నాగేంద్ర, బంగి నాగ తదితరులు పాల్గొన్నారు.

20న పుట్టపర్తిలో 'ఎంహెచ్' అవార్డుల ప్రదానోత్సవం

రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు -మీడియా పాత్రపై సెమినార్

హాజరుకానున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాలగౌడ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఈనెల 20న శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రంలో ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో మోటూరు హనుమంతరావు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రజాశక్తి అనంతపురం ఉమ్మడి జిల్లా ఎడిషన్ మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాశక్తి సాహితీ సంస్థ ప్రతినిధులు, ప్రజాశక్తి రాష్ట్రస్థాయి నాయకత్వం పాల్గొననుందని చెప్పారు. ఈ సందర్భంగా "రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు– మీడియా పాత్ర" అనే అంశంపై సెమినార్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రజాశక్తి దినపత్రిక సంపాదకులు బి. తులసీదాస్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యవక్తగా సుప్రీంకోర్టు పూర్వన్యాయమూర్తి గోపాలగౌడ హాజరవుతున్నారని ఈయనతోపాటు స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి ఉషశ్రీ చరణ్, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, ప్రజాశక్తి అభిమానులు హాజరు కానున్నారని చెప్పారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ ,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పుర ప్రముఖులు ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమంలో పాల్గొననున్నారని తెలిపారు. గౌరవ అతిథులుగా అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్ తెలకపల్లి రవి, నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అనిత, కవి సీనియర్ పాత్రికేయుడు నల్లిధర్మారావు, ప్రజాశక్తి సిజిఎం అచ్యుతరావు హాజరవుతున్నట్లు చెప్పారు. ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును హైదరాబాదు నుంచి వెలువడే నవభూమి పత్రిక జర్నలిస్టు తుమ్మలపల్లి ప్రసాద్‌కు, విఆర్. బొమ్మారెడ్డి స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డుకు బ్యూరో, స్టాఫర్ కేటగిరిలో రాజమహేంద్రవరం స్టాఫర్ బి. శ్రీనివాసాచారికి, మండల విలేకరుల కేటగిరిలో హిందూపురం, సింగరాయకొండ విలేకరులు షబ్బీర్, పి. రవికుమార్‌కు ఈసందర్భంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం పుట్టపర్తి లోని జానకి రామయ్య కళ్యాణ మండపంలో ఉదయం 10:00లకు ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని విలేకరులు, మేధావులు, విద్యావేత్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చెత్తకుప్పల్లో మెడికల్ వ్యర్థాలు

ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నా చర్యలు శూన్యం

చోద్యం చూస్తున్న మున్సిపల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

మనం ఏదైనా ఆసుపత్రికి వెళితే వైద్యులు వ్యాధి నిర్ధారణ కోసం రక్త పరీక్ష చేయించుకుని రమ్మంటారు. వ్యాధి తీవ్రతను తగ్గించేందుకు అవసరాన్ని బట్టి ఇంజక్షన్ వేస్తారు.. వీటి కోసం వినియోగించిన సిరంజిలను ఎక్కడ పడితే అక్కడ వేయడం ప్రాణాంతకం. వాటిని తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన బయోమెడికల్ వ్యర్థ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు ఇవ్వాలి. కొందరు వైద్యులు కక్కుర్తిపడి ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్వాహకులకు వ్యర్థాలు ఇవ్వడం లేదు. రోడ్లపై, చెత్త కుండీల్లో పడేస్తున్నారు. వందల సంఖ్యలో చిన్న, పెద్ద ఆసుపత్రులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. ఆసుపత్రులు, ల్యాబ్‌ల వ్యర్థాలను వీరికి ఇవ్వకుండా రోడ్లపై, చెత్త కుండీల్లో, మున్సిపల్ చెత్త వాహనాల్లో వేస్తున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ప్రయివేట్ ఆసుపత్రులు, వాటికి అనుసంధానమైన ల్యాబరేటరీలు, మెడికల్ షాపుల నుండి రోజుకు కొన్ని వేలల్లో బయోవ్యర్థాలు పోగవుతూ ఉంటాయి. అలా పోగైన బయోవ్యర్థాలను సాధారణ వ్యర్థాలను తొలగించే పురపాలక వాహనాలలో కాకుండా ఒక ప్రత్యేక వాహనం ద్వారా జనావాసాలు లేని ఒక సురక్షితమైన ప్రాంతానికి తరలించి అక్కడ కాల్చివేయాల్సి ఉంది. అయితే పట్టణంలో అలాంటి పరిస్థితులు కనబడటం లేదు. ఆసుపత్రులు నుంచి విడుదలయ్యే సూదులు, సిరంజిలు, గాయాలకు కట్టు కట్టిన దూది, కట్టు గుడ్డ, బ్యాండేజ్ క్లాత్స్, బ్లడ్ బాగ్స్, సెలైన్ బాటిళ్లు, ఐవి సెట్లు, గ్లౌజులు, లాబరేటరీలు నుంచి విడుదలయ్యే రక్తం తీయుటకు వినియోగించిన సూదులు, దూది, డిస్పోజల్ టెస్ట్ ట్యూబ్‌లు, మెడికల్ షాపుల నుంచి విడుదలయ్యే ఎక్స్పైరీ డేట్ అయిపోయిన మందులు మొదలైన వాటిని ఎక్కడ బడితే అక్కడ రోడ్లమీద, మురుగు కాలువలు, చెత్త డబ్బాలలోను విచ్చల విడిగా పడవేస్తున్నారు. ఇలా పడవేయడం వలన చెత్త ఎత్తే సమయంలో వాటి బారిన పడి మున్సిపల్ కార్మికులు అనారోగ్యాల పాలయ్యే

రోడ్డుపక్కన పడేసిన మెడికల్ వ్యర్థాలు

ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. హెచ్ఐవి రోగులకు వినియోగించే సూదులు, బయోవ్యర్థాలు సైతం అందులో ఉండడం వలన పొరపాటున కార్మికులకు ఆ సూదులు గుచ్చుకుంటే వారి జీవితాలు తారుమారయ్యే ప్రమాదం లేకపోలేదు. చెత్తకుప్పల దగ్గర వాటిని పడవేయడం వల్ల ఆవులు, కుక్కలు, ఇతర జంతువులు వాటిని తిని గాయాలపాలై రోగాల బారిన పడే ప్రమాదం ఉంది.బయోవ్యర్థాల మేనేజ్మెంట్ చట్టం 1996 యాక్ట్ ప్రకారం ఈ వ్యర్థాలు ఇతర సాధారణ వ్యర్థాలతో కలపకూడదు. ప్రత్యేకమైన జాగ్రత్తలతో తరలించి వాటిని కాల్చివేయాలని చట్టం చెబుతోంది. అనంతపురం నగరంలో అయితే బయోవ్యర్థాలను తరలించడానికి ప్రత్యేకమైన కంటైనర్లను వినియోగిస్తున్నారు. హిందూపురం పట్టణంలోని బయో వ్యర్థాలను తరలిండానికి అదే వాహనం వస్తోంది. అయితే ఆ వాహనం పట్టణానికి రెండు మూడు రోజులకు ఒకసారి రావడంతో కొంత మంది వారి అసుపత్రులు, ల్యాబ్ నిర్వహకులు మెడికల్ వ్యర్థాలను చెత్తకుప్పల్లో, పట్టణ శివారు ప్రాంతాల్లో వేస్తున్నారు. ఇలా మూడు నెలల క్రితం ఆటోనగర్ సమీపంలో ఓ పాడుపడిన బావిలో మెడికల్ వ్యర్థలు వేశారు. ఎండ తీవ్రతకు మెడికల్ వ్యర్థాలు వేసిన బావిలో మంటలు రేగి గ్యాస్ లీకేజీ అయినట్లు వాసన వచ్చింది. దీంతో సమీపంలో నివాసాలు ఉన్నవారు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి కమిషనర్ పోలీస్, ఫైర్ అధికారుల సహకారంతో ఆయ బావిని మూసివేయించారు. ఇంకా కొంత మంది ధర్మపురం, ఆర్‌పిజిటి రోడ్డులో ఉన్నా చెత్త కుప్పల్లో బయోవ్యర్థలు వేస్తున్నారు. అయినప్పటికి మున్సిపల్ అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఇలాంటి వాటిపై ప్రత్యేకమైన చర్యలు చేపట్టకపోతే ప్రజలు, పశువులకు ప్రాణహానితో పాటు పర్యావరణం కూడా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా బయో మెడికల్ వ్యర్థాలను తొలగించడానికి ప్రత్యేకమైన కంటైనర్లు, వాహనాలను వినియోగించాలని కోరుతున్నారు. ఈ వ్యర్థాలను ఆసుపత్రులు, మెడికల్ షాపులు, లేబరేటరీల వారు ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా చెత్తకుప్పల లోను, డ్రైనేజీల్లోనూ పడవేయకుండా మునిసిపల్, సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్రయివేటు ఆసుపత్రులు బయోవ్యర్థాలను తరలించడానికి రుసుము చెల్లించి ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. కాని వారు అలా చేయడం లేదు. ఇదే సమస్యపై గతంలో ఆసుపత్రుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశాం. కానీ ప్రైవేటు ఆసుపత్రుల వారు షరా మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ సమస్య పట్ల ప్రైవేటు ఆసుపత్రులకు గట్టిగా హెచ్చరికలు జారీ చేసి అదుపు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

నాగేంద్ర.
పర్యావరణ అసిస్టెంట్ ఇంజనీర్

ప్రింటర్ వంశీ ఆత్మహత్యపై

సిట్టింగ్ జడ్జితో విచారించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రౌడీలు, అధికారులు, రాజకీయ నాయకుల ఒత్తిళ్ల కారణంగా ఆత్మహత్య చేసుకున్న ప్రింటర్ వంశీ ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జిపై విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామంలో వంశీకి చెందిన 5.68 ఎకరాల పొలాన్ని కబ్జా చేసేందుకు కుట్ర జరగడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. నేర చరిత్ర కలిగిన వారు అధికార పార్టీల నాయకుల అండతో బలహీనుల భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్న ఘటనలు జిల్లాలో అనేకంగా ఉన్నాయన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్లకు వెళ్లినా సరైన న్యాయం జరగకపోవడం, కోర్టులకు వెళ్లే ఆర్థికశక్తి లేకపోవడంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఏర్పడటం చాలా ఆందోళనకరమన్నారు. ముఖ్యంగా అనంతపురం రూరల్, కూడేరు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, పుట్లూరు, శింగనమల తదితర మండలాల్లో అధికార పార్టీ నాయకుల అండతో కొందరు నకిలీ పట్టాలు సృష్టించి ప్రభుత్వ స్థలాలను తమ ఇష్టం వచ్చినట్లు ప్లాట్లు వేసుకుని విక్రయిస్తున్నారని తెలిపారు. నగరానికి సమీపంలోని రాజీవ్ కాలనీ పంచాయతీలోని 81 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు రికార్డుల్లో ఉండగా మొత్తం భూమిని నకిలీ పట్టాలతో కొందరు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ విషయం అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేకపోవడంతో పేదలు గుడిసెలు వేసుకుంటే రెవెన్యూ ఆక్రమించుకున్నారని తెలిపారు. పేదలు ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకుంటే వెంటనే స్పందించే రెవెన్యూ అధికారులు రూ.కోట్ల విలువజేసే ఆస్తులు కాజేస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అలాగే గార్లదిన్నె మండలం కేంద్రంలో మాజీ సైనికోద్యోగుల పేరుతో దొంగ పట్టాలు సృష్టించి కోట్ల రూపాయలు భూమిని కబ్జా చేస్తున్న విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తెచ్చినందుకు నలుగురు సిపిఎం నాయకులపై కేసులు పెట్టి హైకోర్టుకు తిప్పడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ భూమిని వివాదం కొన్ని నెలలుగా సాగుతున్నా జిల్లా అధికారులు ఇప్పటి వరకు ఆ భూమిని పరిశీలించలేదన్నారు. బికెఎస్‌లో అక్రమంగా ఎర్రమట్టి తరలింపు ఇలా ఏ ఒక్క అక్రమాలపై అధికారులు కఠినంగా వ్యవహరించకపోవడం బాధాకరమన్నారు. ఈనేపథ్యంలోనే వ్యవస్థల మీద విశ్వాసాన్ని కోల్పోయిన వంశీ ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వంశీ హత్యపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

రూరల్ తహశీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలకు అనువుగా ఉండే ప్రాంతంలో అనంతపురం రూరల్ మండల రెవెన్యూ కార్యాలయం ఏర్పాటు చేయాలని సిపిఎం అనంతపురం రూరల్ మండల కార్యదర్శి టి.రామాంజినేయులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూరల్ గ్రామాల ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కొత్త భవనం నిర్మించాలని పేరుతో భవనాన్ని కూలగొట్టి హెచ్.ఎల్.సి కాలనీ దగ్గర తహశీల్దార్ కార్యాలయం మార్చడంతో సర్వీస్ ఆటోలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రూరల్ తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు కక్కలపల్లి కాలనీ, పాపంపేట సమీపాన ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. అక్కడ నిర్మిస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కావున అందరికీ అనుకూలంగా ఉండేలా కార్యాలయం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రూరల్ మండల నాయకులు పుష్పరాజు, చెన్నారెడ్డి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల బహిరంగ వేలం

ప్రజాశక్తి-అనంతపురంక్రైం

అనంతపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్ పరిధిలోని వివిధ ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వివిధ రకాల వాహనాలను 20న మంగళవారం బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవిచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.3000 ధరావతు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

పోరాటం, విజ్ఞానం కమ్యూనిస్టులకు రెండు కళ్లు

సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్టనాయకులు ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యలపై పోరాటం, ఆ పోరాటాలు నడపడానికి విజ్ఞానం కలిగి ఉండడం కమ్యూనిస్టులకు రెండు కళ్లలాగా పని చేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు అన్నారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా శాఖ కార్యదర్శుల రెండు రోజుల శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓబులు మాట్లాడుతూ కమ్యూనిస్టు జ్ఞానాన్ని శిక్షణా శిబిరాల ద్వారా తెలుసుకోవడం, ప్రజల మధ్య ఆచరించి అనుభవ జ్ఞానం ద్వారా మరింతగా అభివృద్ధి కావడం కమ్యూనిస్టులు చేయాల్సిన నిరంతం కర్తవ్యమని అన్నారు. ప్రజలను మోసగించడమే రాజకీయాలుగా మారిన నేటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు కార్యకర్తలు సిద్ధాంత జ్ఞానాన్ని పొందడం మరింత అవసరంగా మారిందన్నారు. శాఖలను క్రమంగా నడపడం, ప్రజా సమస్యలను చర్చించి కార్యచరణ రూపొందించడం కమ్యూనిస్టుల శైలి అని దానిని జిల్లాలో సిపిఎం శాఖలన్నింటిలో అమలు చేయాలని కోరారు.

శాస్త్రీయ దృక్పథంకమ్యూనిస్టుల ఆయుధం

ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాడే కమ్యూనిస్టులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. శాస్త్రీయ ఆలోచన అనే అంశంపై ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ ఆలోచన పెంచుకోకుండా ప్రజలను చైతన్యం చేయలేరన్నారు. సమాజ మార్పుకు కారణాలను తెలుసుకోవడం ద్వారానే నూతన సమాజాన్ని నిర్మించగలమన్నారు. మూఢనమ్మకాలు, తప్పుడు భావాలు ప్రజల్లో ఎంత విస్తృతంగా ఉంటే పాలక పార్టీలకు ముఖ్యంగా బిజెపికి అంతగా తోడ్పాడుతాయని అన్నారు. కమ్యూనిస్టులు ప్రజా సమస్యలపై పోరాడడమే కాకుండా ప్రజల్లో ఉన్న పొరపాటు ఆలోచనల మార్పు కోసం కూడా పోరాడాలన్నారు. నేటి పాలక పార్టీలన్నీ ఎన్నికల్లో గెలవడానికి అనేక హామీలు ఇవ్వడం, గెలిచిన తరువాత వాటిని అమలు చేయకపోవడం, ప్రజలపై భారాలు వేయడం, రాజకీయాల్లో అవినీతిని విచ్చలవిడిగా పెంచడం లాంటివి చేస్తున్నాయన్నారు.. ఈ పరిస్థితులు ప్రజలను మరింత కష్టాల్లోకి నెడుతున్నాయని తెలిపారు. విద్య, వైద్యం పెద్ద వ్యాపారంగా మారాయన్నారు. నిరుద్యోగం పెరిగిపోతోందన్నారు. వీటికి వ్యతిరేకంగా రానున్న రోజుల్లో యువతీ, యువకులు ఉద్యమించక తప్పదన్నారు. వారిని సక్రమమైన పద్ధతుల్లో నడిపేందుకు శాస్త్రీయ దృక్పథమే కమ్యూనిస్టుల ఆయుధంగా ఉండాలన్నారు.

ప్రజల గొంతులు అణచడం ఎవరి తరం కాదు

సమస్యలు ఉన్నతం కాలం ప్రశ్నించే గొంతులు ఉంటాయని మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల కన్వీనర్ ఎ.చంద్రశేఖర్ అన్నారు. పౌర హక్కులు–ప్రభుత్వాల అణచివేత చర్యలు అనే అంశంపై ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు అనేక రూపాల్లో ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి క్రూరమైన చట్టాలను నేటికి అమలు చేస్తూ పౌర హక్కులను కాలరాస్తున్నారన్నారు. తప్పుడు కేసులు పెట్టి నిర్బంధిస్తున్నారని తెలిపారు. ప్రజా సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న విషయాన్ని ఎవరు అడ్డుకోరాదని పాలక పార్టీలు అనుకుంటున్నాయన్నారు. ప్రజల ఐక్యతను చీల్చేందుకు మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, వి.సావిత్రి, ఎం.బాల రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఓలను కొనసాగించాలి

ఫ్యాప్టో ఆధ్వర్యంలో డిఇఓకు వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రస్తుతం పని చేస్తున్న ఎంఇఓలను యథాతథంగా కొనసాగాలని ఫ్యాప్టో నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సైన్స్ సెంటర్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిఇఓ సాయిరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1998 నుంచి ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్ ఉండాలని సంఘాలు నిశిత అభిప్రాయంతో ఉన్నాయని తెలిపారు. ఈ ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ని సాధించడానికి కోర్టు పరిధిలోకి వెళ్లిన సందర్భంగా కూడా ఉమ్మడి సర్వీస్ రూల్స్ కోసం వివిధ ఉపాధ్యాయ సంఘాలు కూడా కోర్టులో కేసులు వేశాయని తెలిపారు. 2023 మే 5న ఉపాధ్యాయ సంఘాలతో విద్యా శాఖ మంత్రి విద్యా శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎంఇఓ - 2 పోస్టులు అన్నీ జిల్లా పరిషత్ వారికి, ప్రస్తుతం ఖాళీగా వున్న ఎంఇఓ -1 పోస్టులలో మాత్రమే గవర్నమెంట్ అధికారులకు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ నిర్ణయానికి అనుగుణంగా ప్రస్తుతం పని చేస్తున్న ఎంఇఓలందరూ యథాతథ పరిస్థితులోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ఛైర్మన్ ఎస్.సిరాజుద్దీన్, జనరల్ సెక్రటరీ జి.లింగమూర్తి, బి.నరసింహులు, కులశేఖర్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ కె.శ్రీనివాసులు, కో ఛైర్మన్ పురుషోత్తం, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ రమణారెడ్డి, గోవిందరాజులు, శ్రీనివాస రెడ్డి, నాగేంద్ర, గోపాలరెడ్డి, జిల్లా నాయకులు వెంకటేష్, సూర్యుడు, రవీంద్ర, జార్జ్, విశ్వనాథరెడ్డి, సర్దార్‌వలి, బాబ్జీనాయక్, అడవిరాజు, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

డిఇఓ సాయిరాంకు వినతిపత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రభుత్వ వసతి గృహాలకు మహర్దశ

సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివ రంగ ప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో ఉన్న 26 సాంఘిక సంక్షేమ హాస్టళ్ల రూపురేఖలు త్వరలో మారనున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివ రంగ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను నాడు నేడు కింద ఏ విధంగా అభివృద్ధి చేశారో అదేవిధంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్ల రూపురేఖలను ఆరు నెలలు లోపు మార్చనున్నారని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించడంతోపాటు ఇంటర్నెట్, కలర్ టీవీ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ప్రశ్న:శ్రీ సత్య సాయి జిల్లాలో ఎన్ని హాస్టల్లో ఉన్నాయి. వాటిలో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఎన్ని?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లావ్యాప్తంగా 26 సాంఘిక సంక్షేమ హాస్టల్ ఉన్నాయి. వాటిలో మూడు నుండి పదవ తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన హాస్టళు బాలురకు 12, బాలికలకు 5 ఉన్నాయి. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఇంటర్మీడియట్ చదివే బాలికలకు 5, బాలురకు 4 ఉన్నాయి.

ప్ర: విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు సరిగా అందుతున్నాయా.?

జ: గతంలో మాదిరిగా కాకుండా విద్యార్థులకు నెలనెలా ఇవ్వాల్సిన కాస్మోటిక్ ఛార్జీలను మార్చి 2023లోనే వారి తల్లుల ఖాతాల్లో జమ చేశాం. మెస్‌ఛార్జీల విషయానికి వస్తే 2018 సంవత్సరములో ఉన్న చార్జీలే ఇప్పుడు అమలు అవుతున్నాయి. వాటి వల్ల ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనం అందించలేక ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చింది. సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. త్వరలో ప్రభుత్వం మెస్‌ఛార్జీలను పెంచే ఆలోచనలో ఉంది.

ప్ర: హాస్టల్ సిబ్బందికి బయోమెట్రిక్ విధానం అమలులో ఉందా?

జ : హాస్టల్ సిబ్బంది బయోమెట్రిక్ విధానాన్ని అవలంబిస్తున్నారు. దాని ద్వారా ఏ అధికారి విధులకు హాజరు కాకపోతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తుంది. ఈ తరుణంలో సిబ్బంది హాజరుపై సంజాయిషి ఇస్తున్నారు. ఈ విధానంతో సిబ్బంది వంద శాతం విధులకు హాజరవుతున్నారు.

ప్ర: అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఎప్పుడు మంజూరు చేస్తారు?

జ: సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పరిధిలో రెండు రకాల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకటి, మూడు నుండి పదవ తరగతి వరకు ఉన్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఆప్‌కార్డ్ నుండి నెలనెలా వేతనాలు అందుతున్నాయి. జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి 30 నెలల నుండి వేతనాలు అందడం లేదు. వారికి మదర్‌థెరిస్సా ట్రస్ట్ నుండి వేతనాలు అందాల్సి ఉంది. ప్రభుత్వం గ్రాంట్ విడుదల చేస్తే మదర్‌థెరిస్సా ట్రస్ట్ బదలాయింపు చేసి వారికి వేతనాలు మంజూరు చేస్తారు.

సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివరంగప్రసాద్

ప్ర : హాస్టళ్ల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేవి?

జ : హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతోంది. ప్రధానంగా అద్దె భవనాల్లో ఉన్న వసతిగృహాలపై దృష్టి పెట్టింది. నాడు నేడు కింద శాశ్వత భవనాలు నిర్మించి హాస్టళ్లను ఉత్తమ స్థాయిలో తీర్చిదిద్దాలన్న దృక్పథంతో ప్రభుత్వం ఉంది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సౌకర్యవంతంగా హాస్టళ్లను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించనున్నాం.

ప్రజాశక్తి www.prajasakti.com

మసీదుకు వెళ్లాలంటే మురుగు దాటాల్సిందే..

అసహనం వ్యక్తం చేస్తున్న ముస్లిములు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని జామియా మసీదు (పెద్ద మసీదు)కు ప్రార్థన కోసం వెళ్లాలంటే తప్పనిసరిగా మురుగునీటిలో తొక్కుంటూ వెళ్లాల్సిందే అని ముస్లిములు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కోటవీధిలో ఉన్న జామియా మసీదు (పెద్ద మసీదు)కు ప్రతి శుక్రవారం ముస్లిములు భారీగా ప్రార్థనలు చేసుకునేందుకు వస్తారు. స్థానికులతోపాటు స్థానికేతరులు వందలాదిమంది శుక్రవారం తరలివస్తారు. మంచి దుస్తులు వేసుకుని వస్తారు. అయితే అక్కడికి చేరుకోవాలంటే మాత్రం దారిలో నిత్యం ప్రవహించే మురుగునీటిని దాటుకోవాల్సిందే. కోటవీధిలోకి వెళ్లే ప్రాంతంలో ఉన్న మోరీ తక్కువ ఎత్తులో ఉండడంతో మురికి కాలువలోని వెల్లాడేదారి అడ్డుపడి కల్వర్టు పై నుంచి మురుగు పారి మసీదుకు వెళ్లే దారిలోకి వస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చూడాలని స్థానికులు, ముస్లిములు కోరుతున్నారు.

రోడ్డుపై పారుతున్న మురుగు

జెఇఇలో 'నారాయణ' విజయకేతనం

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ విద్యాసంస్థల సిబ్బంది

జెఇఇ అడ్వాన్స్-2023 ఫలితాల్లో అనంతపురం నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. భూపతి నిఖిల్ అగ్నిహోత్రి 201 మార్కులతో అఖిల భారత స్థాయిలో ఓపెన్ క్యాటగిరిలో 1552 ర్యాంకు సాధించి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరితోపాటు మరికొంతమంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అఖిల భారత ర్యాంకుల్లో ఆర్. జోత్స్న 466 ర్యాంకు, ఎస్.రామచరణ్ 1360, ఇ.అభిరామ్ 1367, నిఖిల్ అగ్నిహోత్రి 1552, బి.ప్రీతం 2862, వి.వి.భవదీప్ 2749, కె.సాత్విక్ 4671 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు, తల్లిదండ్రులను అనంతపురం కోర్ డీన్ బద్రీనాథ్, శ్రీనివాసరెడ్డి, డీజీఎం వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాల్ రవిశంకర్‌రెడ్డి, లక్ష్మయ్య, శివమణి, జయలక్ష్మి, హిమబిందు, శ్రీధర్ బాబు, ఏజీఎం కేశవరెడ్డి, హరిప్రసాద్ పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

విద్యతోనే సమాజ వికాసం

ప్రజాశక్తి-నార్పల

సిఐ పవన్‌కుమార్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి

విద్యతోనే సమాజ వికాసం సాధ్యమని గ్రహించిన శివశక్తి ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు విద్యార్థులకు ప్రోత్సాహం ఇవ్వడం అభినందనీయమని సిఐ పవన్‌కుమార్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శివశక్తి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో గురుకుల పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపద పంచితే కరిగిపోతుంది, అయితే దాన్ని పంచే గుణం కొందరికే ఉంటుందన్నారు. అలాంటి గొప్ప మనసున్న వారి జాబితాలో శివశక్తిచౌదరి చోటు సంపాదించుకోవడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు లగిసెట్టి నాగరాజు మాట్లాడుతూ శిక్షణ మొదలైనప్పటి నుంచి పూర్తి అయ్యేంత వరకూ తమ సొంత పిల్లలుగా బాధ్యత తీసుకుని వారిని తీర్చిదిద్దడంలో శివశక్తి ఛారిటబుల్ ట్రస్టు బృందం సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, నాగార్జున, చంద్రమోహన్, ద్వారకా విల్సన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు బాబా ఫక్రుద్దీన్, పుల్లయ్య, వెంకటరెడ్డి, స్కూల్ కమిటీ ఛైర్మన్ గంధ్వారి శ్రీధర్, యంగ్ ఇండియా నాగభూషణ, గవ్వల శివశంకర్, రాజేంద్ర, కండెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎస్సీ సెల్ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా ఎర్రిస్వామి

ప్రజాశక్తి-శింగనమల

నియోజకవర్గ అధ్యక్షులుగా వీరనారాయణ

ఎర్రిస్వామి వీరనారాయణ

టిడిపి ఎస్సీ సెల్ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా మొండిపోగుల ఎర్రిస్వామి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా దాల్ వీరనారాయణ నియమితులయ్యారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు ఆదివారం జిల్లా కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎర్రిస్వామి మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా జిల్లాలోని ఎస్సీల్లో చైతన్యం తీసుకొచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అంతేగాకుండా రానున్న సాధారణ ఎన్నికల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబును సిఎం చేసేందుకు సైనికుల్లా పోరాడుతామన్నారు. కమిటీలో శింగనమలకు చెందిన ఎర్రిస్వామి, దాల్ వీరనారాయణ కు చోటు దక్కింది. జిల్లా ఎస్సీ సెల్ సోషల్ మీడియాలో అవకాశం కల్పించేందుకు సహకరించిన టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవతోపాటు ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెస్ రాజు, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నాగరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులే వసూలు చేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు వసూలు చేయాలని వైసిపి విద్యార్థి విభాగం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి యం.జిలాన్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్య శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల జిల్లావ్యాప్తంగా ఉన్న కొన్ని ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఈ-డెక్నో, ఐఐటి బోర్డులు పెట్టుకుని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకువేలు ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫీజు నియంత్రణ చట్టాన్ని నీరు కారుస్తున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి మండల స్థాయి అధికారుల వరకూ సరైన రీతిలో పర్యవేక్షణలు చేసి అధిక ఫీజులు వసూలు, పుస్తకాల అమ్మకం, యూనిఫాం అధిక ధరలకు అమ్మకం తదితర విషయాల్లో యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

IN THE COURT OF THE SPL JUDICIAL FIRST CLASS MAGISTRATE (EXCISE COURT) CUM JUNIOR CIVIL JUDGE, ANANTAPUR.
O.S.NO.796/2022

Between:
V.P.COUSIK ...PLAINTIFF

V/S

Panchagula Neelaveni Died by LRs
1. Sri PVS Sharma S/o PRC Murthy
2. Sri P.Dheeraj S/o PVS Sharma Both residing at Door no 6-645-H3 Maruthi Nagar Extn Ananthapuramu
...DEFENDANTS

ప్రతివాదులకు నోటీసు

ఇందుమూలముగా పైన పేర్కొన్న ప్రతివాదులకు నోటీసు ఏమనగా నా కక్షిదారుడు వి.పి.కౌశిక్ పొందిన విక్రయ ఒప్పంద పత్రం రిజిస్టర్ పత్రం నెంబరు 11507/2007 లో ఒప్పంద భాధ్యత నెరవేర్చకనే గతించిన పంచాంగుల నీలవేణి కి వారసులుగా వున్న ప్రతివాదులైన మీరు ఆమె తరపున నా కక్షిదారుడి ఖర్చులతో కోర్టువారు నిర్ణయించిన తేదీలో నెరవేర్చవలసి వున్నది అని మీపై దావా వేసివున్నారు. ఇందుకు సంబంధించి మీకున్న అభ్యంతరములు, ఆక్షేపణలు తెలుపుకొనుటకు మీరు ఇరువురు స్వయముగా గానీ మీ తరపు న్యాయవాది ద్వారా గాని **05/07/2023** వ తేదీన పై కోర్టు ఎదుట హాజరు కావలెనని కోర్టువారు ఆదేశించివున్నారు. అట్లు కాని యెడల మీ పరోక్షమున తీర్మానం జరుగును. సదరు దావా లో మీరు కోర్టులో తీర్పు వెలువడు వరకు షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి విక్రయమూ జరుపకుండా ఆదేశించాలని కోర్టువారిని మా క్లయింటు ఐ.ఏ /2022 ద్వారా కోరివున్నారు అని కూడా మీకు తెలుపటడమైనది.

SCHEDULE

Property situated within RD SRD of Anantapur, in Narayanapuram Village, within same panchayat limits with the following particulars Govt Dry Sy no 116-1 AC 15 in this Ac 7.50 in this Ac0-22 or 0.088 Hec Plot nos 75,76,81,82
Bounded by: East : Road; West: Road;North: Plot no 77&80 South: plot nos 74&83 Measuring East-West 120 ft or 36.48 mts North–South:80 ft or 24.32 mts total Extent 1066.66 Sq Yards

(కోర్టు ఉత్తర్వుల ఆధారంగా జారీ చేయడమైనది)

వాయిదా తేది: 05/07/2023
నామసేవ హరికృష్ణ, న్యాయవాది అనంతపురం

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోని మాజీ సైనికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ షేకన్న, గౌరవాధ్యక్షులు వీకే రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని హెచ్ఎస్‌సి కాలనీలో ఉన్న విక భవన్‌లో ఏర్పాటు చేసిన మాజీ సైనికుల జిల్లా సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు పలు సమస్యలపై ఏకరువు పెట్టారు. ముఖ్యంగా కొత్తగా రిటైర్డ్ అయి వచ్చిన మాజీ సైనికులకు ఐదెకరాల భూమి కేటాయించాలని, కబ్జాదారుల నుంచి మాజీ సైనికుల భూములను కాపాడాలని, 15 సంవత్సరాలు పూర్తి చేసిన మాజీ సైనికులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగానికి అర్హులుగా ప్రకటించాలని, ఇసిహెచ్ఎస్ ద్వారా మాజీ సైనికుల కోసం రిఫరల్ ఆస్పత్రుల సంఖ్య అనంతపురంలో పెంచడానికి కషి చేయాలని కోరారు. అనంతరం మాజీ సైనికుల జిల్లా సంఘం జిల్లా అధ్యక్షులు, గౌరవాధ్యక్షులు మాట్లాడుతూ కూడేరు మండలం గొట్కూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సైనికపురంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఎలక్ట్రిఫికేషన్, అప్రోచ్ రోడ్డును త్వరలో పూర్తి చేయించనున్నట్లు తెలిపారు. అలాగే ఏదైనా పెద్ద కంపెనీల భాగస్వామ్యంతో డ్రెయినేజీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, తిమ్మారెడ్డి, జంగంశెట్టి సురేష్, నాగిరెడ్డి, కుమారస్వామి, రంగారెడ్డి, పెంచలయ్య, నబిరసూల్, సుశీలమ్మ, అబ్దుల్‌ఖాదర్, అన్వర్‌బాషా, రవికుమార్, గొల్ల ఈశ్వరయ్య, హుస్సేన్‌బాషా, బషీర్ అహ్మద్, రామిశెట్టి నాగరాజు, మహమ్మద్ గౌస్, వై.ప్రసాద్, శివశంకర్, బిఎ హుస్సేన్, మణికుమార్, మహబూబ్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంఘం జిల్లా నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సైనిక సంఘం నాయకులు

మహాగని కలప సాగుతో అధిక ఆదాయం

ప్రజాశక్తి-ఉరవకొండ

అరుదైన, ఖరీదైన మహాగని కలప సాగు చేయడంతో రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు సూచించారు. మహాగని కలప సాగు చేసిన వజ్రకరూరు మండల పరిధిలోని జరుట్ల రాంపురం గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులుతో సాగు, విధివిధానాలపై ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు ఆంజనేయులు మాట్లాడుతూ జనవరిలో మహాగని ఒక్కో మొక్కను రూ.55తో కొనుగోలు చేసినట్లు తెలిపారు. తర్వాత మొక్క నాటడానికి గుంతకు రూ.20 ప్రకారం ఒప్పందం నాటినట్లు తెలిపారు. ఆరెకరాల్లో 1900 మొక్కలను సాగు చేసినట్లు తెలిపారు. ఈ చెట్టు 100 అడుగులు కంటే ఎక్కువగా పెరుగుతుందని, వంద సంవత్సరాలు కంటే ఎక్కువగా బతుకుతుందన్నారు. మహాగని మొక్కలు అనేక రకాలు ఉన్నప్పటికీ దేశంలో స్వీటీనియా మాక్రో ఫిల్లా అనే జాతికి చెందిన మహాగని మొక్కలు పెంచుతున్నారన్నారు. వీటి సాగుకు కేరళ, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్రతోపాటు తెలుగు రాష్ట్రాల్లో అనువైన నేలలు ఉన్నాయన్నారు. ఎర్ర గరప, నల్లరేగడి నేలలు, తేలికపాటి ఇసుకతో కూడిన నేలల్లో ఈ మొక్కలు బాగా పెరుగుతాయన్నారు. ఈమొక్క 17 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతల వరకూ తట్టుకుంటుందన్నారు. మొక్క కోసం నర్సరీల దగ్గరకు వెళ్లినప్పుడు మొక్క సైజు రెండు నుంచి మూడు అడుగుల ఎత్తు ఉన్న మొక్కలనే ఎంపిక చేసుకోవాలన్నారు. గుంత కూడా ఒకటిన్నర అడుగు ఎత్తు, ఒకటిన్నర అడుగు లోతు, ఒకటిన్నర అడుగు వెడల్పు ఉండేలా చూసుకోవాలన్నారు. మహాగని కాయలు ఐదు సంవత్సరాల తర్వాత కాస్తాయన్నారు. ఈ కాయలు చాలా ప్రత్యేకమైనవి అన్నారు. ఈ చెట్టుకు కాసే కాయలు ఆకాశం వైపు నిటారుగా ఉంటాయన్నారు.కాబట్టి ఆకాశం పండు (స్కై ఫ్రూట్) అంటారు. ఈ పండులో 71 విత్తనాలు ఉంటాయన్నారు. వీటిని వలచుకుని తింటే బాదంపప్పులా ఉంటాయన్నారు. ఈ పండును షుగర్ వ్యాధి కలిగిన వారు తింటే షుగర్ వ్యాధి నార్మల్ అవుతుందన్నారు. కావున పండుకు ప్రస్తుతం చాలా గిరాకీ ఉందన్నారు. ఎకరాకు 350 మొక్కలు నాటుకుంటే 12 సంవత్సరాల తర్వాత ప్రతి మొక్క నుంచి రూ.25వేల నుంచి రూ.30వేల వరకూ అప్పటి ధర ప్రకారం వస్తుందన్నారు. అంటే దాదాపుగా రూ.కోటి వరకూ ఆదాయం వస్తుందన్నారు. కావున రైతులు మహాగని మొక్కలు నాటుకుని అధిక లాభాలు గడించాలని కోరారు.

జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు

మహాగని మొక్కను చూపుతున్న జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు, రైతు ఆంజనేయులు

గేయాన్ని ఆలపిస్తున్న కళాకారులు

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనంతపురం

నగర సమీపంలోని శిల్పారామంలో ఆదివారము సాయంత్రం పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల సంస్కృతులు, సంప్రదాయాల పట్ల ఆకర్షితులను చేసే క్రమంలో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం శ్రీకృష్ణ దేవరాయ రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపన అధ్యక్షులు నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి బందం సంగీత విభావరి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్‌బాబు, సూర్యనారాయణరెడ్డి, శ్రీరాములు, ఆదినారాయణ, శేషాద్రి, సర్దార్‌బాషా, కేశవనాయుడు, శ్రీనివాసులు, విజయరామయ్య, హైదర్‌వలి, సుధారాణి, శ్రీదేవి, ఫణి, ఆదినారాయణ, నాగరాజు, నర్సింహులు, శిల్పకళా వేదిక శిల్పారామం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ ఫలితాల్లో 'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-అనంతపురం

జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన శ్రీచైతన్య విద్యార్థులు

జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో అనంత శ్రీ చైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించారు. శ్రీచైతన్య కళాశాలకు చెందిన సాకే గౌతమ్‌సాయి 348వ ర్యాంకు, సాయి దివ్య నైనా 3173, షేక్ జోహార 3759, షేక్ ఖాజీ రీజ ముఖదమ్ 4995 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ఎజిఎం మురళీకృష్ణ, ప్రిన్సిపాళ్లుఆంజనేయులు, దుర్గేష్, రవికుమార్, కిషోర్ కళాశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల సిబ్బంది

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-ఉరవకొండ

సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కును అనంతపురం నగరంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో విశ్వేశ్వరరెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. విడపనకల్లు మండలం పొలికి గ్రామానికి చెందిన కె.నిరంజన్‌కు రూ.3.50 లక్షలు మంజూరైంది. దీంతో గ్రామ నాయకులు చిన్న వెంకటేసులు, దేవేంద్ర, శ్రీనివాసులు, బోయ వెంకటేసులు, బోయ గోవిందు, బండయ్యా, లోకన్న ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ద్వారా లబ్ధిదారునికి చెక్కు అందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేని సన్మానించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సీఎం సహాయనిధి కింద ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపద సమయాల్లో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ఆపద్భందులా ఆదుకుంటుందన్నారు.



సిఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న విశ్వ

మడుగుపల్లెలో నాకాబందీ

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామం మడుగుపల్లిలో ఆదివారం తెల్లవారుజామున సిఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ముందుగా రాజకీయ నాయకులు, రౌడీషీటర్ల ఇళ్లు, కల్లందొడ్లు, పొలాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలన్నారు. ఏమన్నా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అలాకాకుండా గొడవల జోలికి వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటప్రసాద్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే సమాచారమివ్వాలి

ప్రజాశక్తి-నార్పల

మండలంలో రాత్రి సమయాల్లో అనుమానాస్పద వ్యక్తులు గానీ, వాహనాలు గానీ కనిపిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కొద్ది రోజుల క్రితం స్థానిక గూగూడు రోడ్డులో రాత్రి సమయంలో ఇండ్ల ముందు నిలబెట్టిన ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ చోరీ చేస్తూ పోలీసులను చూసి పారిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాల్లో రికార్డయిన దృష్యాలు సోషియల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఈసమయంలో నిందితులు ద్విచక్ర వాహనాన్ని గూగూడు రోడ్డులోనే వదిలేసి వెళ్లారు. ఆ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని దొంగల కోసం గాలిస్తున్నారు. కావున మండలంలో ఎక్కడైనా అనుమానాస్పదంగా గుర్తు తెలియని వాహనాలు కనిపించినా చాలా రోజుల నుంచి ఒకే ప్రదేశంలో నిలబెట్టి ఉన్న రాత్రి సమయంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా వెంటనే సెల్..94901 07853 నెంబర్‌కి సమాచారం అందజేయాలని కోరారు.

జయం పురుషోత్తంకు నివాళి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కడప జిల్లా రాజంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచందిన కళ్యాణదుర్గం ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు జయం పురుషోత్తంకు ఆదివారం పలువురు నివాళు లర్పించారు. మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపి తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి, తదితరులు పార్థివదేహానికి పూలమాలలు వేసి అంజళి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో చింతపండు వ్యాపారిగా, మార్కెట్‌యార్డు కమిటీలో పేరున్న వ్యాపారిగా, అందరితో కలివిడిగా ఉండే జయం పురుషోత్తం హఠాన్మారణం బాధాకరమన్నారు. నివాళుర్పించిన వారిలో పారిశ్రామికవేత్త జీకే.కృష్ణమూర్తి, టిడిపి నాయకులు ఉన్నం మారుతి, చౌళం మల్లికార్జున, పాపంపల్లి రామాంజినేయులు, ఆర్డీ శివశంకర్‌తోపాటు కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆర్యవైశ్య సంఘం నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు ఉన్నారు.

జయం పురుషోత్తం భౌతిక కాయానికి నివాళుర్పిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

క్రికెట్ టోర్నీ విజేత 'రామకోటి'

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల కేంద్రంలోని జడ్పీహెచ్ పాఠశాలలో పదిరోజులు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి క్రికెట్ టోర్నీ విజేతగా రమాకోటి జట్టు నిలిచింది. మండల అధ్యక్షులు రామ్మూర్తిరెడ్డి, జడ్పిటిసి రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి సహాయ సహకారాలతో పది రోజులుగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈమేరకు ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేత జట్టుతోపాటు రన్నరప్ జట్టుకు కేతిరెడ్డి తనయుడు సాయిప్రతాపరెడ్డి విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, వైసీపీ నాయకులు అశోక్, ముచ్చుకోట గ్రామస్తులు, రామకోటి కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కేతిరెడ్డి తనయుడు సాయిప్రతాపరెడ్డి

నేరాలు ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

వివరాలు సేకరిస్తున్న సీఐ హరినాథ్

ఉరవకొండ : పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి కాలనీలో మహానంది (55) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. చిరు వ్యాపారంతో జీవనం సాగిస్తున్న మహానంది ఎప్పటి లాగే వ్యాపారం ముగించుకుని శనివారం రాత్రి 10గం ఇంటికి చేరినట్లు అతని 2వ భార్య మహాలక్ష్మి తెలిపింది. అయితే తెల్లవారుజామున మూడు గంటల సమయంలో తనకు బాగోలేదని చెపి వరండాలో పడుకున్నాడు. ఉదయం లేచి చూడగానే చనిపోయినట్లు గుర్తించామన్నారు. కాగా మృతుడి మొదటి భార్య, కూతుళ్లు మాత్రం తన తండ్రి మరణంపై అనుమానం వ్యక్తం చేశారు. చెవిలో, ముక్కులో రక్తం వచ్చిందని రెండవ భార్య మరో వ్యక్తి కలిసి ఏదో చేసి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ అర్బన్ సీఐ హరినాథ్, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కిరాణా దుకాణంలో చోరీ

గుత్తి : పట్టణంలోని కోళ్లఫారం వద్ద ఉన్న ఓ కిరాణా దుకాణంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. వన్నూరప్ప కొన్నేళ్లగా చిల్లర దుకాణం పెట్టుకుని జీవనం కొనసాగించేవాడు. యథాతథంగా రాత్రి సమయంలో దుకాణానికి తాళం వేసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. గమనించిన గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించారు. క్యాష్ బాక్స్‌లో ఉన్న రూ.2 వేలు నగదు, సిగరెట్ ప్యాక్‌లు, బీడీ కట్టలు అపహరించుకెళ్లారు. ఆదివారం ఉదయం గమణించిన బాధితులు వన్నూరప్ప ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం : స్థానిక రుద్రంపేట బైపాస్‌లో ఆదివారం కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్స్‌పెక్టర్ ఆర్.రవిచంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం స్థానిక రుద్రంపేట బైపాస్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు ఆటోల్లో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని పలు వైన్ షాపుల నుంచి 768 హైవార్డ్స్, విస్కీ, టెట్రా పాకెట్లను అనంతపురానికి తీసుకొస్తున్న రుద్రంపేటకు చెందిన యాగంటి హరీష్, చంద్రబాబునగర్‌కు చెందిన టి.వెంకటేష్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ మునిస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం వివరాలను వెల్లడిస్తున్న సెబ్ ఇన్స్‌పెక్టర్ ఆర్.రవిచంద్ర

వివాహిత ఆత్మహత్యాయత్నం

తాడిపత్రిరూరల్ : భర్త తాగుడు మానుకోకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ మహి ఆదివారం వాస్మాల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మహమ్మద్ రఫి విపరీతమైన తాగుడుకు బానిసయ్యాడు. తాగుడు మానుకుని, జీవితాన్ని సంతోషంగా గడుపుదామని భార్య ఆశాబీ పలుమార్లు చెప్పినా భర్త ప్రవర్తనలో మార్పురాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో వాస్మాల్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు ఆశాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

నిందితుల అరెస్టు

అనంతపురం క్రైం : ప్రింటింగ్ ప్రెస్ యజమాని తుమ్మల వంశీ ఆత్మహత్య చేసుకున్న కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. తన భూమిని కబ్జా చేశారంటూ ప్రింటింగ్ ప్రెస్ యజమాని తుమ్మల వంశీ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇందుకు ప్రేరేపించిన నిందితులు సర్దార్, బుల్లెట్ బాబా, ఖాసీం, అనంతపురం రూరల్ ఆర్ఐ విష్ణుతేజ్‌ను అరెస్టు చేసి సెక్షన్ 306 కింద కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

యోగా దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

యోగా దినోత్సవ కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి-ఉరవకొండ

ఈనెల 21న నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవం వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఆధ్యాత్మిక ధార్మిక యోగా సంస్థల సమాఖ్య ఆయుర్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయుర్ మాట్లాడుతూ జూన్ 21న ప్రపంచ వ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 20న సాయంత్రం పిల్లలు, పెద్దలకు యోగా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. యోగాభిమానులు తప్పక ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు విజేతలు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ప్రభుత్వ ఆయుర్వేద సీనియర్ వైద్యాధికారి ఎస్ఎండి షఫీ, ఉరవకొండ అర్బన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామి, యోగా గురువు వెంకట్, జై కిసాన్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు, ఆయుర్ నిర్వాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రజకుల శ్రేయస్సుకు 'ఆలూరి' సేవలు ఆదర్శం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి జిల్లాలో రజకుల అభివృద్ధి, సమస్యల పరిష్కారం, శ్రేయస్సు కోసం ఆలూరి చంద్రశేఖర్ చేసిన సేవలు ఆదర్శనీయంగా నిలిచాయని రజక సంఘాల నేతలు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర సెక్రటరీ జనరల్ పి.కమ్మన్న అధ్యక్షతన ఆదివారం జిల్లా రజక అభివృద్ధి సంస్థ మాజీ అధ్యక్షులు ఆలూరి చంద్రశేఖర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రజక కార్పొరేషన్ ఛైర్మన్ సుగుమంచిపల్లి రంగన్న, ఆంధ్రప్రదేశ్ రజక జన సేవాసంఘం మాజీ అధ్యక్షులు సి.పెద్దన్న, ఆంధ్రప్రదేశ్ రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర వర్కింగ్ ఛైర్‌పర్సన్ పార్వతి, రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి లింగమయ్య, రజక చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్సీ పరమేష్, రజక రిజర్వేషన్ విద్య సంక్షేమ సంఘం అధ్యక్షులు లింగాల నాగేంద్రబాబు ప్రసాద్, హనుమన్న, జిల్లా రజక అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి యక్కలూరు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు